# 31. సిరి రా మోకాలొడ్డువాడు

మాతాజీ వారి ఉపన్యాసం మొదలయింది.

ఉపన్యాసం వెంకటరావుగారి యింట జరుగుతున్నది. హాలులో రమారమి ఏభై మంది మహిళలు మొజాయిక్‌ఫ్లోరు మీద నున్న పర్షియన్ కార్పెట్, దానిపై పరచిన రాజస్థాన్ దుప్పట్లమీద కూర్చున్నారు. లలితమైన సువాసన ఉదొత్తుల స్టాండ్లు నుండి బయలుదేరి హాలు నలుమూలలకు వ్యాప్తిస్తున్నది.

ఎదురుగా ఎత్తయిన వేదిక మీద మాతాజీ కూర్చున్నారు.

బంగారు జరీ పనిచేసిన కాశ్మీరపుతివాసీ, ఆరుద్ర పురుగు రంగుది దానిమీద పద్మాసనం వేసుకొని మాతాజీ కూర్చున్నారు. ఆమె కట్టిన బెంగుళూరు పట్టుచీర పదిహేను వందలకు తక్కువ ఉండదు. పండు తముల పాకువంటిది ఆమె దేహచ్ఛాయ. చక్కగా నుదుట పూసుకొన్న పసుపు మీద పెద్ద కుంకుమ బొట్టు. విశాలమయిన నయనాల కున్న కాటుక, ముడిచుట్టుకున్న జుత్తులో అక్కడక్కడ తోచిన వెండిపాయలు ఆమె గౌరవానికి ప్రతిష్ఠ తీసుకొని వస్తున్నాయి. ఆమె సర్వాలంకార భూషిత. ఆమె మెడలోని బంగారు నగలలో తాపిన వజ్రాలు మీదను అమర్చిన స్పాటులైటు వెల్తురులో తళుకులీనుతున్నవి. ఆమె వయసు నిర్ణయించడం కష్టం. దేవతల వయసు ముప్పైఏళ్ళకుమించదు. దేవతాస్వరూపులైన మాతాజీ వయసు కూడా అంతకు మించదని భక్తులందరూ అంటారు.

ఆమె కంఠం గంభీరమైనది.

దైవప్రార్థన చేసిన తరువాత ఆమె భగవద్గీత మీద ఒక గంటసేపు ఉపన్యాసం ఇస్తారు. అది సాధారణమైన ఉపన్యాసంకాదు. పురాణాలనుండి మంచి శ్లోకాలు, కావ్యాల నుండి చక్కని పద్యాలు ఆమె వినిపిస్తుంటారు. అప్పు డప్పుడు ఆధునిక సమాజంమీద లలితమైన ఛలోక్తులు విసురుతుంటారు.

మాతాజీఉపన్యాసం వేల కొలది శ్రోతలను సమ్మోహనం చేస్తుంది. కాని, ఈ యాభై మంది మహిళల మధ్య అటువంటి వాతావరణం నెలకొనలేదు. చీరల ఎన్నిక, నగలపసందు, విందులు, పెళ్లిళ్లు మొదలైన వాటి గురించి, ఉపన్యాసం వింటునే, ఆ వచ్చిన వారు మాట్లాడుకుంటున్నారు.

ఉపన్యాసం, ప్రశ్నలు అయిన తరువాత ఆమె ఒక అరగంట అందరిచేత భజన చేయించారు. తరువాత సంగీతం బాగా వచ్చిన ఇద్దరు కీర్తనలు గానం చేశారు. వెంకటరావుగారి

భార్య ప్రతి ముత్తైయిదుకు రవికల గుడ్డ, వెండి కుంకుమ బరిణ చిన్నది. తాంబూలంతోపాటు యిచ్చారు. ప్రసాదాలు పంచి పెట్టారు.

సత్యవతికి ఇదంతా చాల అద్భుతంగా తోచింది

ఆరోజు సత్కాలక్షేపానికి వచ్చిన మహిళలందరూ ప్రత్యేకమైన ఆహ్వానాలమీద వచ్చిన వారే, డాక్టర్లు, ఇంజనీర్లు, ప్రొఫెసర్లు, బిజినెస్ మాగ్నెట్‌లు మొదలయిన వారి సతీమణులు వారు.

అటువంటి వారితోపాటు తనవంటి, మామూలు కలెక్టరాఫీసు బిల్లు గుమస్తా భార్యకు పిలుపురావడం అదృష్టమే.

పిలుపు రావడంతో సరిపోలేదు. దానితో ఎన్నో సమస్యలు ఆమెకు ఎదురయాయి. పట్టుచీరమాట అటుంచి, కట్టుకోడానికి మంచి జరీచీరకూడా ఆమెకు లేదు. మెడబోసిగా ఉందనే చెప్పవచ్చు. పసుపుతాడుకు కట్టిన మంగళసూత్రాలు ఆభరణాల క్రింద జమకావు. చేతులకున్నవి గాజు గాజులు. కాళ్లకు కూడా ఏమీ లేవు. పొరుగు పిన్నిగారి నడిగితే ఆమె మెడలోని నెక్లెసు ఎరువిచ్చేవారు. తనవికాని వస్తువులు ఉపయోగించడం ఆమెకు నచ్చదు.

సత్యవతి కట్టిన చీర చాల మామూలుగా ఉంది. సాయంకాలం పిలుపురాగానే తొందరగా తయారయి వెంకటరావు గారింటికి బయలు దేరింది. దారిలో ఒక డజను అరటిపళ్లు మాత్రం కొంది. ఒట్టి చేతులతో భజనలకు పోకూడదు కదా!

ప్రోగ్రాములోని వన్నీ సరియైన వేళకు ముగిశాయి.

వచ్చిన మహిళలు కొద్ది సేపటిలో ఇళ్లకు బయలుదేరారు. సత్యవతిని మాత్రం వెంకటరావు గారి భార్య కొద్ది సేపు ఉండమన్నారు. అందరూ వెళ్లిపోయి న తరువాత ఆమెను మాతాజీ గదిలోనికి తీసుకొనిపోయారు. వారి ఆశీర్వచనాల తరువాత, ఎంత వద్దని అంటున్నా ఆమెను కారులో యింటికి పంపించారు, కంట్రాక్టరు గారి భార్య.

సత్యవతి యిల్లు చేరేసరికి ఏడుగంటలయింది. అప్పటి కింకా ఆమె భర్త యిల్లుచేర లేదు. ఆమె తొందరగా వంట ప్రయత్నం చేయడం మొదలు పెట్టింది.

సత్యవతికి అంతా ఆశ్చర్యంగానే ఉంది.

ప్రొద్దున్న ఏమీ అనుకోలేదు. మధ్యాహ్నం మూడు గంటల వర కు తనకు ఎటువంటి ఆలోచనలు లేవు. కంట్రాక్టరు వెంకటరావు గారి పనిమనిషి మధ్యాహ్నం మూడున్నరకు వచ్చి, ప్రత్యేకమైన ఆహ్వానపత్రిక యిచ్చి, అమ్మగారు తప్పక రమ్మన్నారని చెప్పినప్పుడు తన చెవులను తానే నమ్మలేక పోయింది.

తనకు, వెంకటరావు గారి భార్యకు, అంత పరిచయం లేదు. ఏదో ఇటువంటి సందర్భంలోనే ఆమె లక్ష పత్రిపూజ చేయుంచారు. చాల మంది ముత్తైదువులకు కొబ్బరికాయలు

పంచారు. వారిలో తాను ఒకతే. తనకామె బాగా జ్ఞాపకమున్నారు. ఆమెకు తను జ్ఞాపకం ఉండడం చాల అరుదు.

సరిగా సాయంకాలం నాలుగున్నరకు అయిదు నిమిషాలు ముందుగా తాను వెంకట రావుగారి యిల్లు చేరింది. తన యింటికి మూడు ఫర్లాంగుల దూరంలో ఆ యిల్లు ఉంది. నగరంలో అటువంటి మంచి యిళ్లను వేళ్ల మీద లెక్క పెట్టవచ్చు. అది మూడంతస్తులమేడ. చాల విశాలమైన స్థలంలో నిర్మించారు. ముందు లాను, పూలమొక్కలు, పోర్టికో, కంటికి యింపైన రంగులు వేసిన గోడలు, మొజాయిక్‌ఫ్లోరులు, ఒకటేమిటి అన్నీ ఆయింటికి ప్రత్యేకమయినవి.

మాతాజీ ఈ వూరు వచ్చి నప్పుడు వారింట్లోనే దిగుతారు.

సత్యవతిని కంట్రాక్టరుగారి భార్య ఆదరంగా లోనికి తీసుకొనిపోయి, మాతాజీ ఎదురుగా కూర్చుండబెట్టారు.

సత్యవతికి ఒళ్లు చచ్చినంత పని అయింది. అందరూ పట్టుచీరలు కట్టుకొని వచ్చారు. వారి మెడలలో ఆభరణాలు చాల విలువైనవి. వారి మధ్య తాను, వేలెత్తి చూపించినట్లు, నేత చీరతో, బోసిమెడతో తననే చూశారు.

“మహిళలు మంగళప్రదమైనవారు. లక్ష్మీదేవి వారసులు, ఆభరణాలు పెట్టుకోడానికి అర్హత కలవారు. ఐశ్వర్యం వారి వలననే వస్తుంది. అటువంటి ఆడవారిలో ఎవరైనా నిరలంకారంగా బోసి మెడతో వస్తే నాకు బాధ కలుగుతుంది. ప్రతి మహిళ మహాలక్ష్మీదేవి వలె కనుపించాలి. చాలమంది ప్రశ్నవేస్తారు. ఐశ్వర్యమన్నది కొందరికే లభిస్తుంది. అందరూ ఎలా లక్ష్మీదేవులవుతారు? నేను ఈ మాటలకు సమ్మతించను. తలుచుకుంటే ఎంతపనిఅయినా చేయగల సామర్థ్యం మనకుంది. మనగమ్యం ఐశ్వర్యం. ఆగమ్యం చేరడానికి ఏమార్గం అవలంబించినా అభ్యంతరం లేదు. చాల మంది చాల విధాలుగా నా మాటలకు వ్యాఖ్యానం చేయవచ్చు. నేను మాత్రం చాల నిర్భయంగా చెప్తున్నాను. భక్తితో ప్రహ్లాదాదులు భగవంతుని చేరుకున్నారు. వైరభక్తితో రావణాదులు భగవంతుని ఇంకా త్వరగా పొందారు. ఆవిధంగా మన గమ్యం ఐశ్వర్యం. మెడనిండా, చేతులకూ ఆభరణాలు, ధరించడానికి పట్టుబట్టలు కావాలని మీరు సంకల్పిస్తేచాలు. అవే వస్తాయి. మీ సంకల్పం మాత్రం దృఢంగా ఉండాలి. సంశయాలకు తావు ఉండకూడదు.”

హాలులో కూర్చున్న మహిళలందరూ తన వేపే చూస్తూంటే తనకు చాల బాధ కలిగింది. ఎందుకు తానీ ఉపన్యాసానికి వచ్చానని విచారించింది.

అంతా అయినతరువాత కంట్రాక్టరుగారి భార్య ప్రత్యేకంగా తనను మాతాజీ ఉన్న గదిలోకి తీసుకొనిపోయారు. ఆమె అప్పుడే స్నానం ముగించి వచ్చారు. ఇద్దరు మహిళలు ఆమెకురులు ఒత్తి సాంబ్రాణి ధూపం వేశారు. మరొకయిద్దరు ఆమె కోసం ఫలాహారం సిద్ధం చేస్తున్నారు మన దృష్టిలో ఫలహారమంటే టిఫిన్ అన్నమాట. అట్టో, రొట్టో, ఏ ఉప్పుడు

పిండియో అయి ఉంటుంది. కాని, మాతాజీకోసం కేవలం ఫలాలనే ఉపయోగిస్తున్నారు. కెంపుల వంటి దానిమ్మ గింజలు, బత్తాయి తొనలు, అరటిపండ్లు, ఆపిల్ పళ్లు, ద్రాక్షలు, బొప్పాయిపండుముక్కలు - అన్ని రకాలు. ఏ కాలంలో దొరికినవి ఆకాలంలో కాక అకాలంలోనివి కూడా ఆమెకోసం తెచ్చినవి- అందులో ఉన్నాయి. ఆగది ఎంత అందంగా అలంకరించారో చెప్పలేము.

అన్నిటికన్నా మాతాజీకి తనపైకలిగిన దయ- అవ్యాజానురాగం. దానికి తాను చాల మురిసిపోయింది.

"అమ్మాయ్! నిన్ను చూస్తుంటే నాకు చాల విచారంకలుగుతుంది. వచ్చిన మహిళల్లో నువ్వొక్కర్తివే బోసిమెడతో, నేతచీరతో ఉండడం నాకు సిగ్గువేసింది. ఇదుగో, ఈ కుంకం నుదుట నుంచుకో! ఈ ప్రసాదం తీసుకో! ఈ పట్టుచీర కట్టుకొని శనివారం సాయంకాలం భజనకురా!"

పక్కనే నిలుచున్న కంట్రాక్టరు గారి భార్య, తన మెడలోనున్న బంగారు గొలుసు, కొత్త దేకాబోలు, కొక్కెంతీసి ఆమె మెడలో వేశారు.

"అమ్మాయ్! నీకు మంచిరోజులు మొదలయాయి. పదికాలాలపాటు నువ్వు ఐశ్వర్యంతో తులతూగు. ఈ గొలుసుతోపాటు నీమెడ ఆభరణాలతో నిండాలి" అన్నారు మాతాజీ మళ్లా.

ఇవన్నీ తలచుకుంటుంటే సత్యవతి మనసు ఆనందంతో పరవశమౌతున్నది.

ఇది కలా! నిజమా, అని ఆమెకు సందేహం కలుగుతున్నది.

మెడలో నున్న గొలుసు మీదచేయివేసి, టేబిలుమీద మడతతో ఉన్న కొత్త పట్టుచీర చూస్తుంటే ఆమె అనుమానాలన్నీ పటాపంచలయాయి.

"ఐశ్వర్యం ఆడవారి జన్మహక్కు."

మాతాజీ వాక్యం సత్యవతికి కావలసినంత ధైర్యం ఇచ్చింది.

సత్యవతి తొందరగా ఒళ్ళు కడుక్కొంది. తెల్లచీర కట్టుకుంది. తలదువ్వుకుంది. బొట్టు పెట్టుకుంటూ అద్దంలోకి చూచుకుంది. మెడలో బంగారు గొలుసు కొత్త అందం చిమ్ముతున్నది.

సత్యవతికి అంత ఆనందంలోను మనసులో ఏమూలనో తాను పెద్ద తప్పు చేసినట్లు అనిపించింది. భర్త రాగానే ఈ గొలుసు మెడలో చూస్తే తప్పుడు అభిప్రాయం కలుగవచ్చునని అనుకుంది. అన్ని విషయాలు అతనికి చెప్పినతరువాత ఆ గొలుసు ధరిస్తే బాగుండునని పించింది.

రామారావు వచ్చేసరికి తొమ్మిది అయింది. రాగానే అతను స్నానంచేసి, భోజనానికి కూర్చున్నాడు. వడ్డించినవన్నీ వేడిగా ఉన్నాయి.

"ఇవాళ ఆలస్యంగా వండినట్లుంది. ఏమిటి విశేషం?" అడిగాడు అతను.

"సాయంకాలం మాతాజీ ఉపన్యాసానికి వెళ్లాను. ప్రత్యేకంగా నా కోసం కంట్రాక్టరు వెంకటరావుగారి భార్య ఆహ్వానపత్రిక పంపించారు. ఆవిడ ఉపన్యాసం చాల బాగుంది. ఎంతమందికో ఇటువంటి ఆవకాశం లభించదు." అంది సత్యవతి.

"అవునవును"

అంతకు మించి రామారావు మరి ప్రశ్నలు వేయలేదు. భోజనం తొందరగా ముగించాడు. ఎన్నో విషయాలు చెప్పాలననుకున్న సత్యవతికి ఆశాభంగమే ఎదురయింది.

ఆమె కూడా భోజనం చేసి, వంటిల్లు సర్దుకొని పడకగదిలోకి వచ్చింది.

రామారావు టేబిలు దగ్గిర కూర్చొని ఏవో కాగితాలు చూసుకుంటున్నాడు.

సత్యవతి చాలసేపు అతనిదగ్గిర కూర్చుంది. అతడేమీ మాట్లాడలేదు.

"ఇంకెంతసేపు ఈ ఆఫీసుపని?" ఆమెకు ఆవులింతలు వస్తున్నవి.

"ఒక్క అయిదు నిమిషాలు"

అతను కాగితాలు జాగ్రత్తగా సర్ది వచ్చాడు.

ఇద్దరూ మంచం మీద పడుక్కున్నారు.

"ఏదో చెప్పాలని అనుకుంటున్నావా?" అడిగాడు రామారావు.

"ఆ ఉత్సాహమంతా చల్లారిపోయింది " అంది ఆమె.

"పనిమీద మనసు ఉన్నప్పుడు నీమాటల మీద ధ్యానం ఉంచడం కష్టం. అందుచేతనే నేను ఏమీ మాట్లాడలేదు. భజన విశేషాలు చెప్పు, విందాం."

సత్యవతి చాల విషయాలు చెప్పింది. బంగారు గొలుసు, పట్టుచీర, పెట్టి నుండి తీసి చూపించింది.

రామారావు ఆమె చెప్పినవన్నీ విన్నాడు. గొలుసు, చీర చూశాడు. చిన్న నవ్వు అతని ముఖంలో తోచింది.

"సత్యవతీ! నువ్వు వట్టి అమాయకురాలివి. ఎరవేసి చేపలు పడతారు. మాతాజీ చాల గొప్పవారు. కంట్రాక్టరు వెంకటరావు నగరంలోని ధనికులలో ఒకరు. ఈ సమావేశాలు, భజనలు ఏ రెండు సంవత్సరాల నుండో జరుగుతున్నది. మామూలు మహిళలకు పిలుపులు లేవు. నిన్ను ప్రత్యేకంగా పిలవడంలో అంతరార్థం తెలుసా?"

"అదే నాకు కూడా అంతుబట్టకుండా ఉంది."

"దీని రహస్యం నాకు తెలుసు. క్షామ నివారణ పథకంక్రింద చాల పనులకు ప్రభుత్వం నిధులను సమకూర్చింది. వీలయినంత మంది క్షామపీడితులకు పనికల్పించి,కూలిముట్టచెప్పడం దీని ముఖ్య ప్రయోజనం. వెంకటరావు అటువంటి పనులన్నిటికీ కంట్రాక్టు పాడాడు. ఇప్పుడు అతని బిల్లులు నాదగ్గరకి వచ్చాయి. నన్ను ఆఫీసులో కలిశాడు. పెద్దవారి చేత చెప్పించాడు. సిగ్గు విడిచి, మంచి పారితోషికం ముట్టచెబుతానన్నాడు. అన్నిటికీ నేను నవ్వి ఊరుకున్నాను. పాతికమంది పనిచేయవలసిన చోట పదిమందినే వేసుకొని, మిగిలిన పేరులకు దొంగవేలిముద్రలు వేయించి, పడరానిబాధలు పడ్డాడు. నేను లొంగకపోతే మరొక విధమైన ఒత్తిడి తేవడానికి ఈమార్గం అవలంబించాడు."

సత్యవతి ఆలోచిస్తున్నది. గమ్యం ముఖ్యం- మార్గం ఏదయినా ఫరవాలేదు

"జీవితంలో ఇటువంటి ఇబ్బందిలో పడడం ఇదే మనకు మొదటిసారి. ఈ ప్రలోభానికి లొంగిపోతే నీ పెట్టినిండా పట్టుచీరలు, నీమెడనిండా నగలు, నాకు ప్రమోషను ఇంకేమిటి ఐశ్వర్యమంతా మనదే."

"మీకు దేవుడిమీద నమ్మకముందా? అతనిని నమ్మి ఏపని చేసినా తప్పులేదన్నారు మాతాజీ. గమ్యం చేరడం ముఖ్యం".

"నాదేవుడు దరిద్ర నారాయణుడు. అతను పని చేయమన్నాడు కాని, తప్పుపని చేయమనలేదు. గమ్యం ముఖ్యమయినదే. అంతకన్న ముఖ్యమైనది దానిని చేరే మార్గం. అది ఋజుమార్గం కాకపోతే గమ్యం చేరినా ప్రయోజనం లేదు. వందలకొద్దీ క్షామపీడితులకు చెందవలసిన డబ్బు ఈభక్తుడు ఈవిధంగా వెచ్చ పెడుతున్నాడు."

సత్యవతి ఆలోచనలో పడింది.

"నువ్వు గుణవంతురాలివని కోరి నిన్ను పెళ్లి చేసుకున్నాను. నేను తప్పుదారిలో పోతుంటే నువ్వు వారించ వలసినదానివి."

సత్యవతికి ఇంకా గొలుసుమీద, పట్టుచీర మీద ఆశ పోలేదు.

"సత్యవతీ ! నువ్వు ఆభరణాలు పెట్టుకోరాదని నేను అనడం లేదు. న్యాయంగా నేను తెచ్చిన డబ్బులో, చెమటోడ్చి చేరవేసిన సంపాదనలో, చాల త్యాగాలు చేసి, సుఖాలకు తిలోదకాలిచ్చి, పొదుపుగా సంసారం చేసి ఆభరణాలు చేయించుకోవచ్చు. అవి ధరించినప్పుడు నీకు కలిగిన ఆనందం, నీకు లభించే సంతృప్తి, అయాచితంగా లభించిన వాటి వలన కలుగవు".

సత్యవతి మరేమీ మాట్లాడలేదు.

భద్రంగా ఆబంగారు గొలుసు, పట్టుచీర పెట్టిలో పెట్టి వచ్చింది.

ఆమె మనసు చాల ఆనందంగా ఉంది.

శనివారం సాయంకాలం రామారావు పెద్ద రిపోర్టు వ్రాసి కంట్రాక్టరు వెంకటరావు బిల్లులు తిప్పివేశాడు.

ఆసాయంకాలం సత్యవతి భజనకు ముందుగా వెళ్లి మాతాజీకి పట్టుచీర, కంట్రాక్టరు భార్యకు బంగారు గొలుసు ఇచ్చివేసి నమస్కరించింది.

" దరిద్రగొట్టుకి సిరి ఎలాపడుతుంది?" అన్నారు మాతాజీ.

ఆమాటలు విన్నా సత్యవతి సిగ్గుపడలేదు.

మానసిక దారిద్ర్యం తనకు లేనందుకు, సంతోషంతో ఇంటివేపు నడిచింది సత్యవతి.

(యువ - మాసపత్రిక) ✶